# ‘జన్మతః పౌరసత్వం’ రద్దు



- తొలిరోజే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ కఠిన నిర్ణయం
- కీలకమైన కార్య నిర్వాహక ఉత్తర్వుపై సంతకాలు
- లక్షలాది భారతీయులపై ప్రభావం పడే అవకాశం
- పారిస్ ట్రీటీ, డబ్ల్యూహెచ్‌వో నుంచి అమెరికా ఎగ్జిట్
- మెక్సికో, కెనడా దిగుమతులపై అదనంగా సుంకాలు
- ‘అమెరికా ఫస్ట్’ స్లోగన్‌కు తగ్గట్టు అధ్యక్షుడి నిర్ణయాలు
- అమెరికాలో అక్రమంగా నివసిస్తున్న 18 వేల మంది భారతీయులను వెనక్కి రప్పించడానికి కేంద్రం యత్నాలు



వాషింగ్టన్/స్పెషల్ టాస్క్ బ్యూరో, జనవరి 21: అమెరికా అధ్యక్ష పగ్గాలను రెండోసారి చేబూనిన డొనాల్డ్ ట్రంప్ మొదటిరోజే కఠినమైన నిర్ణయాలు తీసుకొన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను ఆచరణలోకి తీసుకొచ్చారు. అధ్యక్షుడిగా ప్రమాణస్వీకారం ముగియగానే పెన్ను అందుకున్నారు. పదుల సంఖ్యలో కార్యనిర్వాహక ఉత్తర్వులపై (ఎగ్జిక్యూటివ్ ఆర్డర్లు) సంతకాలు చేశారు. వలసల నుంచి మొదలుకొని పర్యావరణం, వాణిజ్యం వరకు అమెరికాకు సంబంధించి అనేక కీలక నిర్ణయాలను ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ల రూపంలో ట్రంప్ అమలులోకి తీసుకొచ్చారు. తన ఆలోచనల అమలులో కఠినంగా ఉండనున్నట్టు ఆయన చెప్పకనే చెప్పారు. ఈ నిర్ణయాలు అమెరికాతో పాటు ప్రపంచంపైనా ప్రభావాన్ని చూపనున్నాయి. ముఖ్యంగా జన్మతః పౌరసత్వం విధానం రద్దు చేస్తూ ట్రంప్ తీసుకొన్న నిర్ణయం.. లక్షలాది మంది భారతీయులపై తీవ్ర ప్రభావం చూపించనున్నట్టు నిపుణులు చెప్తున్నారు.

**నిర్ణయం: జన్మతః పౌరసత్వం రద్దు**

అమెరికా పౌరులకు పుట్టిన వారికే కాకుండా.. వలస వచ్చిన వారికి అమెరికా గడ్డపై పిల్లలు పుడితే.. ఆ చిన్నారులకు సహజంగా అమెరికా పౌరసత్వం లభిస్తుంది. 1868లో చేసిన 14వ రాజ్యాంగ సవరణ ప్రకారం అప్పటి నుంచి ఈ జన్మతః పౌరసత్వ విధానం కొనసాగుతున్నది. అయితే, దీన్ని రద్దు చేస్తూ ట్రంప్ ఎగ్జిక్యూటివ్ ఆర్డర్ జారీ చేశారు. ‘అక్రమ వలసదారులకు, తాత్కాలిక వీసాపై అమెరికాకు వచ్చిన వారికి పుట్టే పిల్లలకు లభించే జన్మతః పౌరసత్వాన్ని మా ఫెడరల్ ప్రభుత్వం గుర్తించబోదు’ అని ట్రంప్ ప్రకటించారు.

**ఆర్డర్‌లో ఏమున్నది?:** అమెరికా గడ్డపై బిడ్డకు జన్మనిచ్చే సమయానికి తల్లిదండ్రులు అమెరికా పౌరులు కాకపోయినా, ఒకవేళ తండ్రి చట్టబద్ధంగా అమెరికాలో ఉన్నప్పటికీ (తాత్కాలిక వీసాపై).. శాశ్వత నివాసి కాకపోయినా.. ఆ పుట్టిన పిల్లలకు అమెరికా పౌరసత్వం లభించదు. అలాగే, తండ్రి శాశ్వత నివాసి అయినప్పటికీ.. తల్లి తాత్కాలిక వీసా మీద అమెరికాలో నివాసం ఉంటూ బిడ్డను కంటే కూడా ఇదే నియమం వర్తిస్తుంది.

**భారతీయులపై ప్రభావం ఇలా..**

2024 చివరినాటికి అమెరికాలో 54 లక్షల మంది ప్రవాస భారతీయులు ఉన్నారు. అమెరికా జనాభాలో ఇది 1.47 శాతం. వీరిలో 34 శాతం మంది అమెరికాలోనే పుట్టారు. మిగతా వారంతా వలసదారులు. ఈ క్రమంలో ట్రంప్ తీసుకొన్న తాజా నిర్ణయం ఎన్నారైలపై తప్పకుండా ప్రభావం చూపిస్తుందని నిపుణులు అంటున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే.. హెచ్1బీ వంటి తాత్కాలిక వీసాపై అమెరికా వెళ్లి.. గ్రీన్‌కార్డు కోసం వేచిచూస్తున్న వారికి పుట్టిన సంతానానికి ఇప్పటిమాదిరిగా అమెరికా పౌరసత్వం ఇకపై లభించబోదు.

**ఇవీ ప్రతికూలతలే..**

- అమెరికాలోని ఇండియన్ పేరెంట్స్‌కు అక్కడ పుట్టిన పిల్లలకు ఇప్పటిమాదిరి జన్మతః పౌరసత్వం ఇకపై లభించదు.
- ఇమ్మిగ్రెంట్, నాన్-ఇమ్మిగ్రెంట్ వీసాపై అమెరికా వెళ్లిన వారికి జన్మించిన పిల్లలకు అమెరికా పౌరసత్వం లభించడం సాధ్యం కాదు.
- గ్రీన్‌కార్డు కోసం ఏండ్లకేండ్లు ఎదురుచూస్తున్న భారతీయ వలసదారులకు తాజా నిర్ణయం మరో ఆటంకంగా మారనున్నది. అమెరికాలో పుట్టినప్పటికీ తమ పిల్లలకు అక్కడి పౌరసత్వం రాకపోవడంతో గ్రీన్‌కార్డు జారీ ప్రక్రియ మరింత ఆలస్యం కానున్నది.
- అమెరికాలో పుట్టిన పిల్లలకు ఇప్పటివరకూ జన్మతః పౌరసత్వం లభించడంతో వారికి 21 ఏండ్లు నిండిన తర్వాత తమ తల్లిదండ్రులను అమెరికాకు తీసుకొచ్చేవారు. అయితే, తాజా ఉత్తర్వులతో ఇకపై వారు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోలేరు. దీనివల్ల తల్లిదండ్రులు భారత్‌లో, పిల్లలు అమెరికాలో ఉండాల్సి వస్తుంది.
- పిల్లలకు అమెరికా పౌరసత్వం రావాలన్న ఉద్దేశంతో చాలామంది భారతీయ మహిళలు.. తమ డెలివరీ సమయానికి అమెరికా వెళ్తుంటారు. ‘బర్త్ టూరిజం’గా పిలిచే ఈ విధానం ఇకపై కనిపించకపోవచ్చు.

**అమల్లోకి వస్తుందా?**

జన్మతః పౌరసత్వ విధానాన్ని రద్దు చేస్తూ ట్రంప్ తీసుకొన్న నిర్ణయం అమల్లోకి రావడం అంత సులభమేమీ కాదని న్యాయకోవిదులు అంటున్నారు. ఈ నిర్ణయం అమల్లోకి రావాలంటే అమెరికా రాజ్యాంగంలోని నిబంధనలను మార్చాల్సి ఉంటుందని, దీనికోసం హౌజ్, సెనేట్‌లో మూడింట రెండొంతుల మెజార్టీ అవసరమని గుర్తు చేస్తున్నారు. అలాగే రాష్ర్టాల శాసనసభల్లో నాలుగింట మూడొంతుల మంది ఆమోదించాల్సి ఉంటుందని చెప్తున్నారు. కాగా కొత్త సెనేట్‌లో డెమొక్రాట్లకు 47 స్థానాలు ఉండగా ట్రంప్ నేతృత్వం వహిస్తున్న రిపబ్లికన్ పార్టీకి 51 సీట్లు ఉన్నాయి. హౌజ్‌లో డెమొక్రాట్లకు 215 సీట్లు ఉండగా, రిపబ్లికన్లకు 218 స్థానాలు ఉన్నాయి.

**18 వేల మంది వెనక్కి!**

జన్మతః పౌరసత్వ విధానాన్ని రద్దు చేస్తూ ట్రంప్ తీసుకొన్న నిర్ణయం నేపథ్యంలో అమెరికాలో అక్రమంగా ఉంటున్న 18 వేల మంది భారతీయులను తిరిగి వెనక్కి రప్పించడానికి కేంద్రం ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇదే విషయంపై అమెరికా సర్కారుతోనూ చర్చలు జరుపుతున్నదని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఇరు దేశాల దౌత్య-వాణిజ్య సంబంధాలపై ప్రభావం పడకూడదన్న ఉద్దేశంతోనే కేంద్రం ఈ నిర్ణయం తీసుకొన్నట్టు సమాచారం. కాగా అమెరికాలో భారత్‌కు చెందిన అక్రమ వలసదారులు ఇంకా ఎక్కువమంది ఉండే అవకాశమున్నదని నిపుణులు చెప్తున్నారు.

**నిర్ణయం: డబ్ల్యూహెచ్‌వో నుంచి ఎగ్జిట్**

ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) నుంచి వైదొలుగుతూ ట్రంప్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ అంతర్జాతీయ సంస్థకు చైనా కంటే అమెరికానే ఎక్కువ నిధులు వెచ్చించాల్సి వస్తుందనే కారణంతో వైదొలుగుతున్నట్టు ట్రంప్ ప్రకటించారు. పర్యావరణ పరిరక్షణకు ప్రపంచ దేశాలు కలిసి చేసిన పారిస్ పర్యావరణ ఒప్పందం నుంచి సైతం అమెరికా తప్పుకుంటున్నట్టు ట్రంప్ కార్యనిర్వాహక ఉత్తర్వులు జారీ చేశారు. తన మొదటి పర్యాయంలోనూ ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారు.

**ప్రభావం:** అమెరికా తాజా ప్రకటనతో డబ్ల్యూహెచ్‌వోకు ఆర్థికంగా కొంత ఇబ్బందికర పరిస్థితి కలుగొచ్చు. అలాగే ఆ సంస్థ పేద, మధ్య తరగతి దేశాల్లో చేపట్టే హెల్త్ క్యాంప్‌లపైనా ఈ ప్రభావం ఉండొచ్చు. వాతావరణంలోకి కాలుష్యాన్ని ఎక్కువగా వెదజల్లే దేశాల జాబితాలో అమెరికా అగ్రస్థానంలో ఉంటుంది. పారిస్ పర్యావరణ ఒప్పందం నుంచి ఆ దేశం వైదొలగడం కూడా పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలపై ప్రభావాన్ని చూపొచ్చు.

**నిర్ణయం: సుంకాల మోత**

సరిహద్దు దేశాలైన మెక్సికో, కెనడా నుంచి వచ్చే దిగుమతులపై ఫిబ్రవరి 1 నుంచి అదనంగా 25 శాతం మేర సుంకాలు విధించనున్నట్టు ట్రంప్ ప్రకటించారు.

**ప్రభావం:** భారత ఉత్పత్తులపై సుంకాలు విధిస్తామంటూ ఇదివరకే ట్రంప్ ప్రకటించారు. తాజాగా మెక్సికో, కెనడా విషయంలో ఆయన నిర్ణయం ప్రకటించడంతో త్వరలోనే భారత్ సహా ఇతర దేశాలపైనా టారిఫ్‌ల వాత ఉండొచ్చన్న వాదనలు పెరుగుతున్నాయి. మంగళవారం స్టాక్‌మార్కెట్ల నష్టానికి ఇదే ప్రధాన కారణం కావడం గమనార్హం. కాగా అంతర్జాతీయ మారకంగా ఉన్న అమెరికన్ డాలర్‌ను కాదని బ్రిక్స్ కరెన్సీ తీసుకొస్తే.. ఇండియా భాగస్వామిగా ఉన్న బ్రిక్స్ దేశాలపై 100 శాతం సుంకాలు విధిస్తానని సోమవారం ట్రంప్ మళ్లీ హెచ్చరించారు.

**నిర్ణయం: శరణార్థులపై కొత్త ఆంక్షలు**

వలస, శరణార్థ విధానాలకు సంబంధించి అనేక కొత్త ఆంక్షలను ట్రంప్ ప్రకటించారు. అమెరికా-మెక్సికో సరిహద్దుకు బలగాలు పంపుతానని, బోర్డర్‌లో జాతీయ ఎమర్జెన్సీ విధిస్తానని స్పష్టం చేశారు.

**ప్రభావం:** అనధికారికంగా ఏటా వేలాదిమంది భారత్ నుంచి అమెరికాకు శరణార్థులుగా వెళ్తున్నారు. ట్రంప్ తాజా ఆంక్షలు, సరిహద్దుల్లో బలగాల మోహరింపుతో వాళ్లకు చట్టపరమైన చిక్కులు మరింతగా పెరుగనున్నాయి.

**ట్రంప్ మరికొన్ని కీలక నిర్ణయాలు**

- కొవిడ్ సమయం నుంచి ఫెడరల్ ఉద్యోగులకు అమలులో ఉన్న వర్క్ ఫ్రమ్ హోమ్ విధానం రద్దు
- 2020 ఎన్నికల్లో తన ఓటమి తర్వాత 2021 జనవరి 6న యూఎస్ క్యాపిటల్‌పై దాడి చేసిన తన మద్దతుదారులు 1,500 మందికి ట్రంప్ క్షమాభిక్ష పెట్టారు.
- అమెరికా ప్రభుత్వం కేవలం రెండు జెండర్లను(మగ, ఆడ) మాత్రమే గుర్తిస్తుందని ట్రంప్ పేర్కొన్నారు.
- దేశంలో చమురు తవ్వకాలు పెంచేందుకు ‘జాతీయ ఇంధన అత్యవసర స్థితి’ ప్రకటన.
- టిక్‌టాక్‌పై విధించిన నిషేధాన్ని 75 రోజుల పాటు నిలిపివేత.

## డోజ్ నుంచి వైదొలగిన వివేక్ రామస్వామి

వాషింగ్టన్, జనవరి 21: అమెరికాలో భారత సంతతి రాజకీయ నాయకుడు వివేక్ రామస్వామి ట్రంప్ సర్కార్ కొత్తగా ఏర్పాటు చేసిన ‘డిపార్ట్‌మెంట్ ఆఫ్ గవర్న్‌మెంట్ ఎఫిషియెన్సీ’(డోజ్)ను వీడుతున్నట్టు సోమవారం ప్రకటించారు. ఓహియో గవర్నర్ పదవికి ఆయన పోటీ చేసే యోచనలో ఉన్నారు. ‘డోజ్ రూపకల్పనలో సాయం చేయడాన్ని గౌరవంగా భావిస్తున్నా. ప్రభుత్వాన్ని క్రమబద్ధీకరించడంలో మస్క్ అతడి బృందం సఫలీకృతం అవుతుందని భావిస్తున్నా’ అని వివేక్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ‘ఓహియోలో నా భవిష్యత్తు ప్రణాళికల గురించి త్వరలో మరిన్ని విషయాలు చెప్పాల్సి ఉంది. ముఖ్యంగా అమెరికాను మళ్లీ గొప్ప దేశంగా తీర్చిదిద్దడంలో అధ్యక్షుడు ట్రంప్‌కు మేమంతా సాయం చేయడానికి సిద్ధంగా ఉన్నాం’ అని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడిగా ప్రమాణం స్వీకారం చేసిన కొన్ని గంటలకే వివేక్ డోజ్‌లో తన పదవికి గుడ్ బై చెప్తున్నట్టు ప్రకటించారు.

## ఉషా చిలుకూరిపై ట్రంప్ ప్రశంసలు

**ఆమె చాలా తెలివైన వ్యక్తి అని పొగడ్త**

వాషింగ్టన్: అమెరికా సెకండ్ లేడీ, తెలుగింటి ఆడపడుచు ఉషా చిలుకూరి వాన్స్‌పై ఆ దేశ నూతన అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రశంసలు కురిపించారు. సోమవారం ప్రమాణస్వీకారం తర్వాత కార్యక్రమాన్ని ఉద్దేశించి ట్రంప్ ప్రసంగించారు. ‘చాలా కాలంగా జేడీ వాన్స్‌ను చూస్తున్నా. ఓహియో సెనేటర్‌గా పోటీ చేసినప్పుడు ఆయనకు మద్దతు తెలిపాను. వాన్స్ గొప్ప సెనేటర్. ఆయన భార్య ఉషా చాలా తెలివైనవారు. ఉపాధ్యక్షురాలిగా ఉషానే ఎంపిక చేసుకోవాల్సి ఉన్నా కుదరలేదు. వాన్స్ దంపతులిద్దరూ గొప్పవారు’ అంటూ ట్రంప్ పొగడ్తల జల్లు కురిపించారు. కాగా, అమెరికా నూతన ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సతీమణి ఉషా చిలుకూరి తెలుగు వారే అన్న సంగతి తెలిసిందే. ఆమె తల్లిదండ్రులు క్రిష్, లక్ష్మీ చిలుకూరి ఆంధ్రప్రదేశ్ నుంచి అమెరికాకు వలసవెళ్లారు.

## తాత్కాలిక జడ్జీలతో క్రిమినల్ కేసుల విచారణ

**పెండింగ్ కేసుల పరిష్కారానికి సుప్రీం కోర్టు సూచన**

న్యూఢిల్లీ: భారీ సంఖ్యలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ అప్పీళ్లను విచారించడానికి హైకోర్టుల్లో తాత్కాలిక న్యాయమూర్తుల నియామకం చేపట్టాలని సుప్రీంకోర్టు మంగళవారం సూచించింది. చాలా హైకోర్టులలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసుల వివరాలను సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం ప్రస్తావిస్తూ.. ఒక్క అలహాబాద్ హైకోర్టులోనే 63,000 క్రిమినల్ కేసులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపింది. హైకోర్టులకు చెందిన సిట్టింగ్ జడ్జీల నేతృత్వంలో డివిజన్ బెంచీలు క్రిమినల్ అప్పీళ్లను విచారించేందుకు వీలుగా తాత్కాలిక న్యాయమూర్తుల నియామకం కోసం 2021లో తాము ఇచ్చిన తీర్పును స్వల్పంగా మార్చగలమని సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. మంజూరైన న్యాయమూర్తుల సంఖ్యలో 80 శాతం మంది విధుల్లో ఉన్న హైకోర్టులలో తాత్కాలిక న్యాయమూర్తిని నియమించరాదని ధర్మాసనం తెలిపింది. అయితే ఒక సిట్టింగ్ జడ్జి నేతృత్వం వహిస్తున్న డివిజన్ బెంచీలోనే తాత్కాలిక న్యాయమూర్తి పనిచేయవలసి ఉంటుందని, ఆ బెంచీలు క్రిమినల్ అప్పీళ్లను మాత్రమే విచారించాల్సి ఉంటుందని ధర్మాసనం షరతు విధించింది.

# 14 మంది నక్సల్స్ మృతి

- ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లో భీకర ఎన్‌కౌంటర్
- మృతుల్లో మావోయిస్టు పార్టీ అగ్ర నాయకుడు చలపతి
- ఆయనపై రూ. కోటి రివార్డు
- చివరి దశలో హడలెత్తిస్తున్న ఆపరేషన్ ‘కగార్’



కొత్తగూడెం ప్రగతి మైదాన్, జనవరి 21: దండకారణ్యంలో మావోయిస్టులు, భద్రతా బలగాల మధ్య యుద్ధం నడుస్తున్నది. ఛత్తీస్‌గఢ్-ఒడిశా సరిహద్దుల్లో మంగళవారం పోలీసులు, మావోయిస్టుల మధ్య భీకర ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో 14 మంది మావోయిస్టులు మృతి చెందినట్టు పోలీసులు ధ్రువీకరించారు. మృతుల్లో మావోయిస్టు పార్టీ అగ్రనేత చలపతి ఉన్నారు. ఒడిశాలోని నువాపాడ జిల్లా సరిహద్దును ఆనుకుని ఉన్న ఛత్తీస్‌గఢ్‌లోని గరియాబంద్ జిల్లా మేయిన్‌పూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అడవుల్లో ఈ ఎన్‌కౌంటర్ జరిగింది. ఇక్కడ మావోయిస్టులు సంచరిస్తున్నారనే సమాచారం అందడంతో ఒడిశా స్పెషల్ ఆపరేషన్, ఛత్తీస్‌గఢ్ డీఆర్‌జీ, సీఆర్‌పీఎఫ్, కోబ్రా బెటాలియన్లకు చెందిన సుమారు వెయ్యి మందికి పైగా భద్రతా దళాలు సంయుక్తంగా గాలింపు చేపట్టాయి. ఈ క్రమంలో మంగళవారం మావోయిస్టులు తారసపడటంతో ఎదురుకాల్పులు మొదలయ్యాయి. ఇరువర్గాల మధ్య గంటల వ్యవధిలో నాలుగైదుసార్లు భీకర పోరు జరిగింది. మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉన్నది.

**మృతుల్లో అగ్రనేత చలపతి**

ఎదురుకాల్పుల్లో మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు జయరామ్ అలియాస్ చలపతి మృతి చెందారు. ఆయనతో పాటు మరో అగ్రనేత సైతం మృతిచెందినట్టు సమాచారం. చలపతిపై కోటి రూపాయల రివార్డు ఉంది. సోమవారం ఇదే అటవీప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ మృతు ల్లో నల్లగొండ జిల్లా చండూరు మండలం పుల్లెంల గ్రామానికి చెందిన పాక మంతయ్య అలియాస్ హన్మంతు (65) ఉన్నట్టు తెలుస్తున్నది. ఆయన గ్రామానికి చెందిన పాక చంద్రయ్య, ఎట్టమ్మ దంపతుల కుమారుడు. విద్యార్థి దశలో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్‌లో పని చేసిన హన్మంతు 1981లో మావోయిస్టు పార్టీలోకి వెళ్లారు.

**వేగం పుంజుకున్న ‘కగార్’**

ఆపరేషన్ ‘కగార్’ మరింత వేగాన్ని పుంజుకుంది. ఇప్పటికే మావోయిస్టులకు షెల్టర్ జోన్‌గా మారిన అబూజ్‌మడ్ అడవులను వేలాది మంది సాయుధ బలగాలు జల్లెడ పడుతూ దాదాపు వారి స్వాధీనంలోకి తీసుకున్నాయి. ఎన్‌కౌంటర్లలో గత 21 రోజుల్లోనే సుమారు 40 మందికి పైగా మావోయిస్టులు మృతి చెందారు.

**నక్సల్ విముక్త భారత్ దిశగా కీలక విజయం: అమిత్ షా**

ఎన్‌కౌంటర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా ‘ఎక్స్’లో స్పందించారు. ఇది నక్సలిజానికి భారీ ఎదురుదెబ్బ అని, నక్సల్ విముక్త భారత్ నిర్మాణం దిశగా మన భద్రతా బలగాలు సాధించిన కీలక విజయమని ఆయన పేర్కొన్నారు. ఒడిశా-ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో సీఆర్పీఎఫ్, ఒడిశా ఎస్ఓజీ, ఛత్తీస్‌గఢ్ పోలీసులు ఉమ్మడి ఆపరేషన్ జరిపి 14 మంది నక్సలైట్లను హతమార్చారని ఆయన తెలిపారు. నక్సల్ విముక్త భారత్ దిశగా తమ లక్ష్యం, భద్రతా బలగాల సంయుక్త ప్రయత్నాలతో నక్సలిజం కొన ఊపిరితో ఉందన్నారు.

# ఉచితాల గాలంతో ఓట్ల వేట!

- ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో ఆప్, బీజేపీ, కాంగ్రెస్ పోటాపోటీ
- పాత వాటికి అదనంగా కేజ్రీవాల్ పార్టీ కొత్త హామీలు
- రేవడీలకు వ్యతిరేకమంటూనే కమలం పార్టీ వరాల జల్లు
- రెండు పార్టీలకు పోటీగా కాంగ్రెస్ ఉచిత హామీలు







న్యూఢిల్లీ, జనవరి 21: ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం అధికార ఆమ్ ఆద్మీ పార్టీ, బీజేపీ, కాంగ్రెస్ శాయశక్తులా కృషి చేస్తున్నాయి. మూడోసారి అధికారాన్ని దక్కించుకునేందుకు ఆప్ ప్రయత్నిస్తుండగా, రాజధానిలో ఆమ్ ఆద్మీ పార్టీకి చెక్ పెట్టి అధికారాన్ని కైవసం చేసుకోవాలని కమలం పార్టీ, కాంగ్రెస్ శ్రమిస్తున్నాయి. ఓటర్లను ఆకట్టుకునేందుకు మూడు పార్టీలూ భారీగా హామీలు ప్రకటిస్తున్నాయి. పాత పథకాలను కొనసాగిస్తూ ఇంకొన్ని కొత్త పథకాలను అమలు చేస్తామని ఆప్ ఢిల్లీ ఓటర్లకు హామీలు ఇస్తున్నది. సంక్షేమ పథకాలతో ఢిల్లీవాసుల్లో ఆదరణ పొందిన కేజ్రీవాల్‌కు పథకాలతోనే చెక్ పెట్టేందుకు బీజేపీ ప్రయత్నిస్తున్నది. గతంలో అనేకసార్లు ఉచిత పథకాలను విమర్శిస్తూ వచ్చిన ఆ పార్టీ ఢిల్లీలో మాత్రం అనేక హామీలను గుప్పిస్తున్నది. ఇప్పటికే ఒక మ్యానిఫెస్టోను విడుదల చేసిన కమలం పార్టీ.. మంగళవారం రెండో మ్యానిఫెస్టోను విడుదల చేసింది. ప్రస్తుతం అమలులో ఉన్న పథకాలనూ కొనసాగిస్తామని హామీ ఇచ్చింది. ఈ రెండు పార్టీలకు ఏమాత్రం తగ్గకుండా కాంగ్రెస్ హామీలు ఇస్తున్నది. ఇప్పటికే ఎన్నికల్లో గెలిచేందుకు తెలంగాణ, కర్ణాటక, హిమాచల్ ప్రదేశ్‌లో ఆ పార్టీ ఇచ్చిన ఉచితాల హామీలు రాష్ర్టాలను ఆర్థికంగా దివాలా తీయిస్తున్నా కాంగ్రెస్ మాత్రం వెనక్కు తగ్గలేదు.

**బీజేపీ హామీలు**

- మహిళలకు నెలకు రూ.2,500
- పీజీ వరకు ఉచిత విద్య, పోటీ పరీక్షల అభ్యర్థులకు రూ.15 వేలు
- గర్భిణులకు రూ.21 వేలు, ఆరు పోషకాహార కిట్లు
- రూ.500 కే గ్యాస్ సిలిండర్, హోలీ, దీపావళికి ఉచిత సిలిండర్లు
- 60-70 మధ్య వయసు వారికి రూ.2,500 పింఛను
- 70ఏండ్లు పైబడిన వారికి, వితంతువులు, దివ్యాంగులకు రూ.3,000 పింఛను
- ఆటో, ట్యాక్సీ డ్రైవర్లకు ప్రమాద, వాహన బీమా, వారి పిల్లలకు స్కాలర్‌షిప్‌లు

**ఆమ్ ఆద్మీ హామీలు**

- మహిళలకు నెలకు రూ.2,100
- 60 ఏండ్లు పైబడిన వారికి ప్రభుత్వ, ప్రైవేటు దవాఖానల్లో ఉచిత వైద్యం
- ప్రైవేటు సెక్యూరిటీ గార్డులను నియమించుకునేందుకు రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్లకు ఆర్థికసాయం
- ఆటోడ్రైవర్లకు రూ.10 లక్షల ఆరోగ్య బీమా, వారి ఆడబిడ్డల వివాహాలకు రూ.1 లక్ష సాయం
- అద్దెకు ఉండే వారికి ఉచిత విద్యుత్తు, మంచినీటి సరఫరా

**కాంగ్రెస్ హామీలు**

- మహిళలకు నెలకు రూ.2,500 ఆర్థిక సహాయం
- అందరికీ 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు
- రూ.500కే ఎల్‌పీజీ గ్యాస్ సిలిండర్
- పేదలకు బియ్యం, చక్కెర, వంటనూనె, పప్పులు, టీపొడితో కూడిన రేషన్ కిట్ల పంపిణీ
- రూ.25 లక్షల వరకు ఆరోగ్య బీమా
- నిరుద్యోగ యువతకు నెలకు రూ.8,500 భృతి.

## వైద్య కళాశాల అధ్యాపకుల అర్హతల సడలింపు

**కొత్త ముసాయిదా విడుదల**

న్యూఢిల్లీ, జనవరి 21: వైద్య కళాశాలల్లో అధ్యాపకుల అర్హతకు సంబంధించిన నిబంధనలను నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) సడలించింది. మెడికల్ పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీతో పాటు 220 పడకలున్న బోధన, బోధనేతర ప్రభుత్వ దవాఖానలలో నాలుగేండ్ల అనుభవం ఉన్న నాన్ టీచింగ్ కన్సల్టెంట్లు, స్పెషలిస్టులు, మెడికల్ ఆఫీసర్లు ఇక నుంచి అసిస్టెంట్, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు అర్హులవుతారని ఎన్ఎంసీ తన ఉత్తర్వుల్లో పేర్కొంది. అయితే దీనికి ముందు బయోమెడికల్ రిసెర్చిలో ప్రాథమిక కోర్సు (బీసీఎంఆర్) తప్పనిసరిగా పూర్తి చేయాలి. దీనికి సంబంధించిన నూతన నిబంధనలు పబ్లిక్ డొమైన్‌లో అందుబాటులో ఉంచారు.

# బెంగళూరులో మహిళపై గ్యాంగ్‌రేప్

- బస్ కోసం వేచి చూస్తుండగా దుండగుల లైంగిక దాడి
- బీజేపీ పాలనలో జరగలేదా?: ముఖ్యమంత్రి సిద్ధరామయ్య

బెంగళూరు, జనవరి 21: కాంగ్రెస్ పాలిత కర్ణాటకలో ఒక మహిళపై సామూహిక లైంగిక దాడి జరిగింది. బస్ కోసం వేచిచూస్తున్న మహిళను మభ్యపెట్టి తీసుకెళ్లిన కొందరు ఆమెపై సామూహిక అత్యాచారం చేయడమే కాక, ఆమె వద్ద ఉన్న నగలు, నగదును దోచుకున్నారు. కాగా, అత్యాచారాలు జరగడం రాష్ట్రంలో ఏమన్నా కొత్తా అన్న రీతిలో ముఖ్యమంత్రి సిద్ధరామయ్య స్పందించడం గమనార్హం. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం రాత్రి 11.30 గంటలకు బెంగళూరు కేఆర్ మార్కెట్ ప్రాంతంలోని గోడౌన్ స్ట్రీట్ వద్ద ఒక మహిళ ఎలహంక వెళ్లడానికి బస్ కోసం వేచి చూస్తున్నది. బస్ ఎన్నిగంటలకు వస్తుందని నిందితులను అడిగింది. దాంతో వారు బస్ వేరే చోట ఆగుతుందని నమ్మించి ఆమెను గోడౌన్ వీధిలోకి తీసుకెళ్లి లైంగిక దాడి చేశారు. తర్వాత ఆమె వద్ద ఉన్న బంగారు ఆభరణాలు, డబ్బు దోచుకుని ఉడాయించారు. బాధితురాలు సెంట్రల్ డివిజన్‌లోని మహిళా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. నిందితులలో ఒకరిని అరెస్ట్ చేసినట్టు పోలీసులు తెలిపారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు దిగజారాయని, హోం మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని బీజేపీ నేత విజయేంద్ర డిమాండ్ చేశారు.

**మీ హయాంలో జరగలేదా?: సిద్ధరామయ్య**

బీజేపీ హయాంలో అత్యాచారాలు జరగలేదా? అని కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ప్రశ్నించారు. మహిళపై లైంగిక దాడిపై బీజేపీ చేస్తున్న డిమాండ్ గురించి ఆయన బెళగావిలో స్పందించారు. రాష్ట్రంలో బీజేపీ పాలించిన కాలంలో లైంగిక దాడులు జరగలేదా? అని ప్రశ్నించారు. అయితే మహిళలపై అత్యాచారాలు జరగకూడదని, వారికి రక్షణ కల్పించాలని అన్నారు. సమాజంలోని కొన్ని అసాంఘిక శక్తులు లైంగిక దాడులకు పాల్పడుతున్నాయని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

## స్క్రాంజెట్ ఇంజిన్ గ్రౌండ్ టెస్ట్ సక్సెస్

**హైపర్‌సానిక్ క్షిపణుల తయారీలో మైలురాయి**

న్యూఢిల్లీ: హైపర్‌సానిక్ క్షిపణుల తయారీలో కీలక ముందడుగు పడింది. ఈ తర్వాతి తరం క్షిపణుల్లో వినియోగించే దీర్ఘకాలిక సూపర్‌సానిక్ కంబషన్ రాంజెట్(స్క్రాంజెట్) ఇంజిన్ గ్రౌండ్ టెస్ట్ విజయవంతంగా పూర్తి చేసినట్టు మంగళవారం రక్షణ శాఖ ప్రకటించింది. డీఆర్డీవో విభాగమైన హైదరాబాద్ కేంద్రంగా పని చేసే డిఫెన్స్ రిసెర్చ్ అండ్ డెవెలప్‌మెంట్ ల్యాబొరేటరీ(డీఆర్‌డీఎల్) ఈ స్క్రాంజెట్‌ను తయారుచేసింది. భారత్‌లో మొదటిసారి 120 సెకన్ల పాటు స్క్రాంజెట్ గ్రౌండ్ టెస్ట్ జరిపినట్టు రక్షణ శాఖ వెల్లడించింది. అన్ని ప్రమాణాల్లో ఈ ఇంజిన్ విజయవంతంగా పని చేసినట్టు తెలిపింది. కాగా, హైపర్‌సానిక్ క్షిపణులు అత్యాధునిక ఆయుధాలు. ఇవి మాక్ 5కి మించిన వేగంతో ప్రయాణించగలవు. అంటే, ధ్వని వేగానికి ఐదింతల వేగంతో దూసుకుపోతాయి.



## తుర్కియేలో అగ్నిప్రమాదం.. 66 మంది మృత్యువాత

అంకారా: వాయువ్య తుర్కియేలోని ప్రసిద్ధ స్కీ రిసార్ట్ వద్ద గల 12 అంతస్తుల హోటల్‌లో మంగళవారం మంటలు చెలరేగి 66 మంది పర్యాటకులు మరణించారు. ఈ ప్రమాదంలో మరో 51 మంది గాయపడినట్టు అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి అలీ యెర్లీకయ తెలిపారు. బొలు ప్రావిన్సులోని కర్తాల్‌కయ వద్ద గల రిసార్టులో ఉన్న 12 అంతస్తుల గ్రాండ్ కర్తాల్ హోటల్‌కు చెందిన రెస్టారెంట్‌లో తెల్లవారుజామున 3.30 గంటలకు మంటలు చెలరేగాయని అధికారులు తెలిపారు.

## ఇజ్రాయెల్ సైన్యాధిపతి రాజీనామా

**అక్టోబర్ 7 నాటి దాడిని అడ్డుకోవటంలో విఫలమైనందుకు**

జెరూసలేం: ఇజ్రాయెల్-హమాస్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం అమల్లోకి వచ్చిన కొద్ది గంటల్లోనే.. ఇజ్రాయెల్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆ దేశ సైన్యాధిపతి హెర్జి హాలివీ రాజీనామా ప్రకటించారు. మార్చి 6న తాను బాధ్యతల నుంచి వైదొలగుతున్నట్టు మంగళవారం తెలిపారు. గతేడాది అక్టోబర్ 7న హమాస్ మిలిటెంట్స్ దాడిని పసిగట్టడంలో, అడ్డుకోవటంలో విఫలమైనందుకు రాజీనామా చేస్తున్నట్టు చెప్పారు. ఆనాటి దాడి నుంచి ఇజ్రాయెల్‌కు రక్షణ కల్పించటంలో తన మిషన్ విఫలమైందని రాజీనామా లేఖలో పేర్కొన్నారు. మరో ఉన్నతాధికారి మేజర్ జనరల్ యారోన్ ఫింకెల్‌మాన్‌లు కూడా బాధ్యతల నుంచి తప్పుకుంటూ రాజీనామా సమర్పించారు. ఆనాటి హమాస్ దాడి వైఫల్యాలపై విచారణ జరపాలన్న డిమాండ్ ఇజ్రాయెల్‌లో ఊపందుకుంది.